



www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 14 సెప్టెంబర్ 2023

ఉపాధి కల్పించడం తప్పా? : 'వికాస్'

ప్రజాశక్తి - కడప

నిరుద్యోగ యువకులకు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ల ద్వారా ఉద్యోగ కల్పన చేయడం చంద్రబాబు చేసిన తప్పా? అని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2014లో చంద్రబాబు సిఎం అయ్యాక నిరుద్యోగ యువతకు ఉద్యోగ కల్పన లక్ష్యంగా పనిచేశారని తెలిపారు. యువతకు ఉద్యోగాలు కల్పించినందుకు ఓర్చుకోలేక ఈ జగన్ ప్రభుత్వం చంద్రబాబుని అరెస్టు చేశారని పేర్కొన్నారు. యువకులు, నిరుద్యోగులు గ్రహించాలని కోరారు. సమావేశంలో 15, 5, 47, 22వ డివిజన్ ఇన్‌ఛార్జులు కొండా సుబ్బయ్య, బండి జయశంకర్, జనార్దన్‌రెడ్డి, శ్రీనివాసులు, బిసి సెల్ జిల్లా ఉపాధ్యక్షుడు ఆదోని దస్తగిరి పాల్గొన్నారు.

పకడ్బందీగా ఆరోగ్య సురక్ష నిర్వహించాలి : కలెక్టర్

మాట్లాడుతున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

ప్రజాశక్తి-కడప అర్బన్

జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని పకడ్బందీగా, ప్రత్యేక ప్రధాన్యతతో నిర్వహించాలని కలెక్టర్ వి.విజయ్‌రామరాజు అధికారులను ఆదేశించారు. బుధవారం తాడేపల్లి నుండి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంపై ముఖ్యమంత్రి నిర్వహించిన విసికి కలెక్టరేట్లోని బోర్డు మీటింగ్ హాల్ నుంచి కలెక్టర్ వి.విజయ్‌రామరాజు, కడప నగర కమిషనర్ ప్రవీణ్ చంద్ హాజరయ్యారు. సిఎం విసి ముగిసిన అనంతరం ఆయన అందించిన మార్గదర్శకాల మేరకు వైద్యాధికారులు, మున్సిపల్ కమిషనర్లు, సంబందిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30 తేదీన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించి ఈ నెల 15వ తేదీ నుంచి వాలంటీర్లు ఇంటింటికి వెళ్లి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించిన బ్రోచర్లు పంపిణీ చేయాలన్నారు. 16వ తేదీ నుంచి ఏఎన్ఎంలు, సిహెచ్వోలు ప్రజల ఆరోగ్య సమస్యలను గుర్తించి వారిని వైద్య శిబిరాలకు పంపించాలన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష పేద ప్రజలకు వరం లాంటిదని వైద్య అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. వైద్యులు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాలలో మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలన్నారు. ఈ క్యాంపులో ఇద్దరు స్పెషలిస్ట్ డాక్టర్లు, ఇద్దరు మెడికల్ ఆఫీసర్లు వైద్య సిబ్బంది మెడికల్ క్యాంపులో పాల్గొనడం జరుగుతుందన్నారు. వైద్యులు రోగులను ఇతర ఆసుపత్రులకు రెఫర్ చేసేటప్పుడు పేషెంట్ వివరాలు ఆరోగ్యశ్రీ యాప్‌లో అప్లోడ్ చేయాలన్నారు. ప్రభుత్వం జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా చేపడుతోందని జిల్లా వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే, సర్పంచ్ ఇతర ప్రజా ప్రతినిధులు అందరినీ ఆహ్వానించి భాగస్వామ్యం చేయాలన్నారు. క్యాంపు నిర్వహించే గ్రామాలలో ఒక రోజు ముందే అన్ని ఏర్పాట్లు సిద్ధం చేసుకోవాలని సూచించారు. అదనంగా వైద్య సిబ్బంది కోసం నర్సింగ్ కళాశాలల విద్యార్థుల సేవలను వినియోగించుకోవాలని డిఎంహెచ్ఒను ఆదేశించారు. ఈ నెల 30న రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి సంబంధించి జిల్లా స్థాయి పైలట్ క్యాంపును ఈనెల 25వ తేదీన నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని వైద్య ఆరోగ్య, అంగన్వాడీ, విద్యాశాఖ, పంచాయతీరాజ్ తదితర అనుబంధ శాఖల అధికారులు విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ డాక్టర్ నాగరాజు, డిసిహెచ్ఎస్ డాక్టర్ హిమదేవి, జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ రమాదేవి, జిల్లాలోని మున్సిపల్ కమిషనర్లు, అధికారులు పాల్గొన్నారు

కరువు మండలాలను ప్రకటించాలి

- ఎపి రైతు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

ఒంటిమిట్ట చెరువును పరిశీలిస్తున్న నాయకులు

ప్రజాశక్తి-ఒంటిమిట్ట

ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్‌లో తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయని, వెంటనే కరువు మండలాలను ప్రకటించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.దస్తగిరిరెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.నరసయ్య తెలిపారు. బుధవారం ఒంటిమిట్టలో అడగంటిన చెరువును వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితితో రైతులు అరకొర పంటలు వేశారని తెలిపారు. అప్పులు చేసి వేల రూపాయలు పెట్టుబడి పెట్టి వేసిన పంటలు ఎండు దశకు వచ్చాయని చెప్పారు. పత్తి, వేరుశనగ, మిర్చి, మొక్కజొన్న, ఆముదం, కంది, మినుము వంటిపంటలు కూడా సకాలంలో వర్షాలు లేక సగానికి సగం దెబ్బతిన్నాయని పేర్కొన్నారు. బోరు బావుల కింద ఉన్న అరకొర పంటలను కాపాడుకుందామంటే విద్యుత్ సరఫరా సక్రమంగా ఉండడం లేదని విద్యుత్ కోతలతో ఉన్న కొద్దిపాటి పంటలు దెబ్బ తింటుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను రూపొందించి రైతులను ఆదుకోవాల్సిన ప్రభుత్వం, వ్యవసాయ శాఖ ప్రణాళిక లేమితో చోద్యం చూస్తోందన్నారు. కనీసం వేసిన పంటలను కాపాడేందుకు అవసరమైన చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇ-క్రాప్ నమోదు చేయటంలో కూడా సర్వర్, నెట్‌వర్క్ ప్రాబ్లం, యాప్ డౌన్లోడ్ కాకపోవడం వంటి కారణాలతో పంటల నమోదు సక్రమంగా చేయటం లేదని తెలిపారు. వర్షాభావంతో పంటలు దెబ్బతిన్న అన్ని ప్రాంతాలను కరువు ప్రాంతాలుగా గుర్తించి కరువు సహాయక చర్యలు చేపట్టాలని, నష్టపోయిన రైతులు, కౌలు రైతులకు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం పంటను బట్టి ఎకరాకు రూ.40 వేలు నుంచి రూ.50 వేల వరకు నష్టపరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంటలు వేయని రైతులకు ఎకరాకు రూ.20 వేలు జీవన భృతిగా ఇవ్వాలన్నారు. రైతులు, కౌలు రైతులకు రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేయాలని, కౌలు రైతులకు కౌలు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకంలో అదనంగా 100 రోజులు పనులు పెట్టాలన్నారు. వ్యవసాయ మోటర్లకు 9 గంటల విద్యుత్ నిరంతరాయంగా అందించి ఉన్న పంటలను కాపాడాలని పేర్కొన్నారు. ప్రత్యామ్నాయ వ్యవసాయ ప్రణాళికను రూపొందించి రబీలో పంటలు వేసేందుకు 90 శాతం సబ్సిడీతో రైతులకు ప్రభుత్వం విత్తనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సోమశిల వెనుక జలాల ద్వారా ఒంటిమిట్ట చెరువుకు పైపులైన్ ద్వారా నీటిని నింపి చెరువు ఆయకట్టు రైతులను కాపాడాలన్నారు. పై సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 25వ తేదీన తహశీల్దార్ కార్యాలయాల ఎదుట నిర్వహించే ధర్నాకు రైతులు పెద్ద ఎత్తున పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతు సంఘం మండల అధ్యక్షులు పుల్లయ్య, వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షులు రాము, నాయకులు వెంకటసుబ్బారెడ్డి, నరసయ్య, రవి పాల్గొన్నారు.

జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలి : యుటిఎఫ్

ప్రజాశక్తి-కడప అర్బన్

దేశ విద్యా విధానానికి నష్టాన్ని చేకూర్చే జాతీయ విద్యా విధానాన్ని వెంటనే రద్దు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మిరాజ, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎస్.కె.జాబీర్ డిమాండ్ చేశారు. ఉద్యోగ ఉపాధ్యాయ హక్కుల్ని కాపాడే పాత పెన్షన్‌ను పునర్దించాలని డిమాండ్ చేస్తూ ఆలిండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ అండ్ కాలేజీ, టీచర్స్ ఆర్గనైజేషన్, జాయింట్ ఫోరమ్ ఫర్ మూవ్మెంట్ ఆన్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం ఢిల్లీలో జంతర్మంతర్ వద్ద పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్పొరేట్లకు లాభం చేకూర్చే ప్రైవేటీకరణకు దారి తీసే విద్య మొత్తం వ్యాపారమయం చేసే జాతీయ విద్యా విధానం వల్ల తీవ్ర నష్టమని, భవిష్యత్తులో కార్పొరేట్లకు లాభాలు చేకూర్చే జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాల్సిందేనని డిమాండ్ చేశారు. ఉద్యోగుల హక్కుగా ఉన్న పెన్షన్‌ని బిక్షగా మార్చి నూతన పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చి ఉద్యోగుల హక్కుల్ని అందించే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెన్షన్లకు వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు రకరకాల పేరు పెట్టినా పాత పెన్షన్ విధానానికి సాటి రావని పేర్కొన్నారు. వెంటనే పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ మొత్తాన్ని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.

JFME DHARANA PROGRAMME
TEACHERS' ORGANISATIONS
SAVE EDUCATION, SAVE CAMPUS, SAVE NATION
ROLL BACK NEP 2020. RESTORE OPS FILL ALL VACANT POSTS
REGULARISE ADHOC / CONTRACT TEACHERS
10% GDP ON
WITHDRAW CUET, NEET etc.
Withdraw NEP 2020
Restore Old Pensi

ఢిల్లీలో ధర్నా చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉమ్మడి పరీక్షల విధానం పేరుతో రాష్ట్ర హక్కులను హరిస్తున్న కేంద్ర ప్రభుత్వం వైఖరిని దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వాలకు ఉన్న రాజ్యాంగబద్ధ హక్కులను ఇవ్వాలన్నారు. నీట్ లాంటి పరీక్షలు రద్దు చేయాలన్నారు. విద్యను,యూనివర్సిటీలను,జాతిని ప్రవేటీకరణ నుంచి రక్షించాలని డిమాండ్ చేశారు.

పర్యావరణాన్ని కాపాడుదాం : డిఎంహెచ్ఒ

పోస్టర్ ఆవిష్కరిస్తున్న డిఎంహెచ్ఒ నాగరాజు, డివైఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-కడప అర్బన్

మట్టి గణపతిని ప్రతి ఒక్కరూ ప్రతిష్టించి పర్యావరణానికి హానికరమైన ప్లాస్టిక్ ఆఫ్ ప్యారిస్‌ని వాడకుండా అందరం పర్యావరణాన్ని కాపాడుకుందామని డిఎంహెచ్ఒ నాగరాజు తెలిపారు. బుధవారం డివైఎఫ్ఐ జిల్లా కమిటీ అధ్వర్యంలో ముద్రించిన మట్టి గణపతిని ప్రతిష్టిద్దాం పర్యావరణాన్ని కాపాడుదాం పోస్టర్‌ను వైద్య శాఖ అధికారి కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ ప్రస్తుతం పర్యావరణం అనేక రకాల రీతిలో కాలుష్యం అవుతూ రోజు రోజుకు జీవావరణానికి ప్రమాదకరస్థాయిలో ఏర్పడిందని తెలిపారు. పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. వినాయక చవితి అందరూ సుఖసంతోషాలతో జరుపుకోవాలని ముఖ్యంగా పర్యావరణానికి హానికరమైనటువంటి ప్లాస్టిక్ ఆఫ్ ప్యారిస్ లాంటి వాటిని దూరంగా ఉంచి మట్టి గణపతి విగ్రహాలను ప్రతి ఒక్కరు ప్రతిష్టించి పర్యావరణం కాలుష్యం కాకుండా చూసుకోవడానికి అందరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇటువంటి మంచి కార్యక్రమాలు నిర్వహిస్తున్న డివైఎఫ్ఐ యువజన సంఘం నాయకత్వానికి అభినందనలన్నారు. డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు ముడియం చిన్ని, వీరణాల శివకుమార్ మాట్లాడుతూ పోరాటాలు మాత్రమే కాదని ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తుందన్నారు. ప్రస్తుతం పర్యావరణం కాలుష్యం తీవ్ర స్థాయిలో వుందన్నారు. దేశంలో మెట్రో లాంటి నగరాలు పర్యావరణ కాలుష్యము ప్రమాద స్థాయిలో వుందని గణాంకాలు చెబుతున్నాయన్నారు. ఇటువంటి సందర్భంలో అందరూ పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన భాధ్యత వుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు డేవిడ్ రాజ్, రబ్బా నరసింహులు, నగర అధ్యక్షులు షాకీర్ పాల్గొన్నారు.

ఎస్పితో విద్యార్థులు, పాఠశాల డైరెక్టర్ వివేకానందరెడ్డి

ఎస్పిని కలిసిన ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-కడప అర్బన్

నూతన ఎస్పిగా జిల్లాకు వచ్చిన సిద్ధార్థ కౌశల్‌ను చిన్నచౌక్‌లోని ఇంటర్నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్ విద్యార్థులు మర్యాదపూర్వకంగా కలిశారు. బుధవారం ఎస్పిని పూలమాల, శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలని చెప్పారు. లక్ష్యసాధనకు కష్టపడాలని తెలిపారు. విద్యార్థుల సేవ, ట్రాఫిక్ క్లబ్ నిర్వహణ తీరుపై అభినందించారు. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ ఎం.వివేకానందరెడ్డి, ఇన్‌ఛార్జి రజియా, పిఇటి లక్ష్మయ్య, ఓబుల్ రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

వైవీయూ వార్షిక పరీక్షల్లో సంస్కరణలు : విసి

ప్రజాశక్తి-కడప అర్బన్

యోగి వేమన విశ్వవిద్యాలయం వార్షిక పరీక్షల్లో సంస్కరణలు అమలు చేస్తున్నట్లు విసి ఆచార్య చింతా సుధాకర్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన తన చాంబర్లో కుల సచివులు ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, పరీక్షల నియంత్రణ అధికారి ఆచార్య ఎన్.ఈశ్వరరెడ్డి, అన్ని విభాగాల అధిపతులతో కలిసి బేటి అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్ట్ గ్రాడ్యుయేషన్ విద్యార్థులకు సెమిస్టర్ పరీక్షలు ఒకే చోట నిర్వహించడం కాకుండా, ఆయా శాఖలలో నిర్వహించేలా వికేంద్రీకరణ దిశగా నిర్ణయం తీసుకున్నామన్నారు. ఇకపై ప్రతి డిపార్ట్మెంట్ వారి శాఖలోనే పరీక్షలు నిర్వహించాలన్నారు. సరికొత్త విధానంలో క్వశ్చన్ పేపర్ మేనేజ్మెంట్ సిస్టం అమలు చేస్తున్నామన్నారు. ప్రశ్నాపత్రం ఆన్‌లైన్‌లో సంబంధిత హెడ్లకు కొన్ని నిమిషాల ముందు అందుతుందని వాటిని ప్రింట్ చేసి విద్యార్థులకు అందించాల్సి ఉంటుందన్నారు. పరీక్షలు పూర్తి అయిన వారంలోపే ఫలితాలు ఇచ్చేలా మూల్యాంకనం చేయాల్సి ఉంటుందన్నారు. పరీక్షల ప్రారంభం నుంచి ఫలితాలు ప్రకటించే వరకు రెగ్యులర్ అధ్యాపకులు ఎవ్వరు సెలవు తీసుకోకూడదని స్పష్టం చేశారు. క్వశ్చన్ పేపర్ మేనేజ్మెంట్ సిస్టం గురించి ఆచార్య ఎన్.ఈశ్వర్‌రెడ్డి అవగాహన కల్పించారు. సమావేశంలో అన్ని శాఖల అధిపతులు పాల్గొన్నారు.

ఘనంగా జిల్లా స్థాయి యువజనోత్సవాలు

ప్రజాశక్తి - కడప

జిల్లా యువజన సర్వీసుల శాఖ(స్టెప్) ఆధ్వర్యంలో బుధవారం కడప నగరంలోని సెయింట్ జోసెఫ్ జూనియర్ కళాశాలలో జిల్లా స్థాయి యువజనోత్సవాలు-2023 ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ సభ్యులు, కార్పొరేటర్ పాకా సురేష్ జిల్లా స్థాయి యువజనోత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యువజనోత్సవాలలో యువత విరివిగా పాల్గొని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్టెప్ సిఇఒ సి.సాయి గ్రేస్ మాట్లాడుతూ ఈ యువజనోత్సవాలు స్వామి వివేకానందుని జన్మదినం పురస్కరించుకొని జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలో జరుగుతాయన్నారు. నెహ్రూ యువ కేంద్ర అధికారి మణికంఠ మాట్లాడుతూ యువతకు చదువుతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో కూడా పాల్గొనడం వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందన్నారు. కళాశాల కరస్పాండెంట్ ఎల్.ఆరోగ్య స్వామి మాట్లాడుతూ స్టెప్ ఆధ్వర్యంలో ఈ యువజనోత్సవాలు మా కళాశాలలో నిర్వహించడం ఆనందదాయకమన్నారు. ఇటువంటి కార్యక్రమాలు మరెన్నో మా కళాశాలలో నిర్వహించాలని కోరారు. యువత తమలోని ప్రతిభను వెలికి తీయడానికి ఇది ఓ మంచి తరుణమని సీనియర్ సివిల్ జడ్జి కవిత అన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు.

బాధితురాలికి నగదు అందజేస్తున్న హర్షవర్ధన్‌రెడ్డి

అర్థరైటీస్ బాధితురాలికి రూ.లక్ష సాయం

ప్రజాశక్తి - పోరుమామిళ్ళ టౌన్

పోరుమామిళ్ల మండలం రంగసముద్రం పంచాయతీ సుందరయ్య కాలనీకి చెందిన చిట్టిబోయిన లక్ష్మిదేవి అనే యువతి రుమటాయిడ్ అర్థరైటీస్ అనే వ్యాధితో బాధపడుతుంది. ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉండి సహాయం కోసం ఎదురు చూస్తున్న సమయంలో మండలంలోని మార్కాపురంకు చెందిన పారిశ్రామికవేత్త గొంగల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి తన టీమ్ ఐటి సభ్యులతో కలసి రూ.లక్ష ఆర్థిక సాయం చేసి మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబీకులు సంతోషం వ్యక్తంచేశారు.

ఎన్ని కష్టాలొచ్చినా పోరాడుతాం : 'మన్నూరు'

ప్రజాశక్తి-కడప అర్బన్

ఎన్ని కష్టాలొచ్చినా ప్రజల కోసం పోరాడుతామని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూర్ అక్బర్ అన్నారు. బుధవారం తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో అప్రజా స్వామికంగా పోలీసులతో ప్రజలను, ప్రతిపక్ష నాయకులను అవినీతి మరకలు అందించి తనతో పాటు చంద్రబాబు నాయుడు అవినీతి పరుడని చెప్పేదానికి ముఖ్యమంత్రి వేసిన ప్లాన్‌ను సిఐడి, సజ్జల రామకృష్ణారెడ్డి అమలు పరుస్తున్నారని పేర్కొన్నారు. చంద్రబాబు ఏ తప్పు చేయలేదని ప్రజలు నమ్ముతున్నారని తెలిపారు. ప్రజల కోసం, ప్రజా స్వామ్యంకోసం రాజీ లేని పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. సమావేశంలో టిడిపి నగర ఉపాధ్యక్షులు కొండా సుబ్బయ్య, మైనారిటీ నాయకులు రాజంపేట సలాం, రూపనగుడి హుస్సేన్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం : ఎంఇఒ

కలసపాడు: విద్యార్థులకు చదివే కాకుండా మానసిక ఉల్లాసం కోసం క్రీడలు ఎంతో అవసరమని ఎంఇఒ మస్తాన్‌వలి తెలిపారు. బుధవారం మండలంలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో జరుగుతున్న క్రీడోత్సవాలలో ఆయన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో స్కూల్ గేమ్స్ జరిపేందుకు సహకరించిన బాలుర ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు మెర్సిమాలినిని, గేమ్స్ ఫెడరేషన్ కో-ఆర్డినేటర్ సగిలి, సుమన్‌ను అభినందించారు. అనంతరం ఆచప మాట్లాడుతూ నిరంతరం విద్యార్థులకు చదువే కాకుండా, చదువుతోపాటు క్రీడలకు కూడా అవసరమని తద్వారా విద్యార్థుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఎంత ఉపయోగపడుతుందని తెలిపారు. అనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్సిమాలిని మాట్లాడుతూ మహిళలు అన్ని రంగాలలో ముందుండారని, పాఠశాల దశ నుండే బాలికలు చదువుతోపాటు క్రీడలు, ఇతర సాంస్కృతి కార్యక్రమాలు కూడా ఎంతో అవసరమని తెలిపారు. బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు కవిత మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతం నుండి చదువుకునేటువంటి విద్యార్థిని విద్యార్థులకు మానసిక ఆనందాన్ని ఇచ్చుటకు ఈ క్రీడలు ఎంతో ఉపయోగమన్నారు. కార్యక్రమంలో రామాపురం ప్రధానోపాధ్యాయులు బ్రహ్మానందరెడ్డి, శంఖవరం పిఇటి, రవి, పిఎఫ్ ప్రసన్న, రామాపురం రవి, సురేష్, కెజిబివి పిఇటి వాణి, బాలికోనత పాఠశాల పిఇటి రమాదేవి, ఆంటోనీ పాఠశాల పిఇటి కోమలమేరి, ప్రసాద్‌రావు, వినీత్, ఖాసిం వలి పాల్గొన్నారు.

కబడ్డీ ఆడుతున్న క్రీడాకారులు

Andhra Pradesh Congress Committee
HUMAN RIGHTS C KADAPA DISTRICT

సమావేశంలో మాట్లాడుతున్న హబీబ్

టాక్స్‌లు పెంచడం అన్యాయం : కాంగ్రెస్

ప్రజాశక్తి - కడప

వాహనాల త్రైమాసిక టాక్స్‌ను తగ్గించాలని, జిఒ నెంబర్ 31ని రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం డ్రైవర్స్ యూనియన్ నగర అధ్యక్షులు హబీబ్ డిమాండ్ చేశారు. బుధవారం డిసిసి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం జిఒ 31ని ప్రవేశపెట్టి వాహనాలకు టాక్స్‌ను పెంచడం సరికాదన్నారు. పొరుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేనంత విధంగా ఎపిలో టాక్స్‌లు పెంచారన్నారు. ఇలా పెంచుకుంటూ పోతే లారీలను, మినీ బస్సులను, ఐచర్ వాహనాలను నడుపుకునే వాళ్ల పరిస్థితి ఏంటని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే టోల్ రేట్స్ పెంచారు, పెట్రోల్ డీజల్ పెంచారని తెలిపారు. సమావేశంలో కార్మిక నాయకులు బాబు, సోహెల్, బ్రహ్మానందరెడ్డి, శ్రీనివాసరెడ్డి, భాష, మహమ్మద్ రఫీ, బాలకృష్ణారెడ్డి, నరసారెడ్డి, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

మహిళలకు ఆపన్న హస్తం సఖి సెంటర్ : జడ్జి

ప్రజాశక్తి - కడప

ఆపదలో ఉన్న మహిళలకు ఆపన్న హస్తం వన్ స్టాప్ సెంటర్ (సఖి) అని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ సెక్రటరీ ఎస్.కవిత అన్నారు. ఒకే చోట అనేక సేవలు లభిస్తాయని, వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. బుధవారం ఆమె వన్ స్టాప్ సెంటర్‌ను సందర్శించి మాట్లాడుతూ సెంటర్లో అత్యవసర స్పందన, చట్టపరమైన సలహాలు, పోలీస్ సహాయం, మానసిక సలహాలు, వీడియో కానారేన్స్, వైద్య సహాయం, తాత్కాలిక ఆశ్రయం లాంటి సేవలు ఉంటాయని పేర్కొన్నారు. గృహహింస, అత్యాచారాలు, లైంగిక వేధింపులు, యాసిడ్ దాడులు, మహిళల అక్రమ రవాణా, బాలలపై లైంగిక వేధింపులు, బాల్య వివాహాలు, కిడ్నాప్లు, సైబర్ నేరాలు, వరకట్న వేధింపులు, వరకట్న మరణాలు వంటి సందర్భాల్లో మహిళలు వన్ స్టాప్ సెంటర్‌ను సంప్రదించవచ్చునని పేర్కొన్నారు. ఉచిత న్యాయ సహాయం, లీగల్ సర్వీసెస్ అథారిటీ చట్టం గురించి వివరించారు. మహిళలు 181 ఉమెన్ హెల్ప్ లైన్, 1098 చైల్డ్ హెల్ప్ లైన్, 100 పోలీస్ హెల్ప్ లైన్ మొదలగు టోల్ ఫ్రీ నెంబర్ లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సంప్రదించవచ్చు అని చెప్పారు. కార్యక్రమంలో వన్ స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అశ్విని, సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రబాబును ఎదుర్కోలేకే అక్రమ కేసులు

చాపాడు: రిలే నిరాహారదీక్షలకు సంఘీభావం తెలుపుతున్న లింగారెడ్డి

ప్రజాశక్తి-చాపాడు

టిడిపి జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ప్రజల కోసం నిత్యం పోరాడుతున్నాడని రాబోయే ఎన్నికల్లో ప్రజలు ఆయనకు పట్టం కడతారని ఆయనను నేరుగా ఎదుర్కొనలేక అక్రమ కేసులు బనాయించి వైసిపి ప్రభుత్వం కక్ష సాధింపుగా వ్యవహరిస్తుందని టిడిపి జిల్లా అధ్యక్షులు లింగారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మైదుకూరులో టిడిపి నాయకులు తలపెట్టిన రిలే నిరాహార దీక్షకు ఆయన సంఘీభావం తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యోగుల అభ్యున్నతికి కృషిచేసిన చంద్రబాబు నాయుడును ఆధారాలు లేకపోయినా అక్రమంగా అరెస్టు చేయడం దారుణమన్నారు. టిడిపి కార్యకర్తలు ప్రతి గడపకు వెళ్లి వైసిపి అవినీతిని వివరించాలన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ధనపాల జగన్, దాసరి బాబు, మేకల బాబు, వైవి సుబ్బారెడ్డి, అన్నవరం సుధాకర్‌రెడ్డి, వెంకట సుబ్బయ్య, ప్రభాకర్, శ్రీను, రాకెట్ రఫీ కార్యకర్తలు పాల్గొన్నారు. **జమ్మలమడుగు రూరల్ :** చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా జమ్మలమడుగు తెలుగుదేశం పార్టీ ఇన్‌ఛార్జి చదిపిరాళ్ళ భూపేష్ సుబ్బరామిరెడ్డి ఆధ్వర్యంలో రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. కార్యక్రమంలో పెద్దముడియం మండలం నాయకులు మల్లారెడ్డి, కొండారెడ్డి, చెన్నారెడ్డి, జగదీశ్వర్‌రెడ్డి శ్రీకాంత్, శంకర్‌రెడ్డి, పుల్లారెడ్డి, చంద్ర, సుబ్బరాయుడు, గంగయ్య, జమాల్ భాష, బాలరాజు, మునిస్వామి, మస్తాన్ వల్లి, హుస్సేన్, బి.మహేష్, విజయ మోహన్ రెడ్డి, సామ్సావలి, మైలవరం మండల నాయకులు ప్రసాదు, అంకాల్, వెంకటేశ్వర్ రెడ్డి, ముని శంకర్, లక్ష్మీ నరసయ్య, జమ్మలమడుగు మండలం నాయకులు శంకర్, పొన్న తోట శ్రీనివాసులు కలరు. వీరికి సంఘీభావం మాజీ ఎమ్మెల్సీలు దేవగుడి నారాయణరెడ్డి, శివనాథ్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి రమణారెడ్డి, సిపిఐ నాయకులు సంఘీభావం ప్రకటించారు. **వేంపల్లె :**మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును అరెస్టు చేయడం దుర్మార్గమని టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి అన్నారు. రిలే నిరాహార దీక్షలను చేపట్టారు. దీక్షలో ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ షబ్బీర్, మైనార్టీ నేత నిమ్మకాయల మహమ్మద్ దర్బార్, డివి సుబ్బారెడ్డి, మహమ్మద్ ఇనాయతుల్లా, డక్కా రమేష్, వీరబద్ర, రామాంజనేయురెడ్డి, వెంకటయ్య, జబిబుల్లా, పాపిరెడ్డి, రెడయ్య, మడక శ్రీనివాసులు, ఆదినారాయణ, పిపి చెంద్రాయుడు, బాలకృష్ణారెడ్డి, యుగంధర్, వెల్డింగ్ బాషా, గోగుల మల్లికార్జున పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల లెక్చరర్‌కు డాక్టరేట్

ప్రజాశక్తి - పోరుమామిళ్ల టౌన్

లెక్చరర్ నగేష్

పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గణిత శాస్త్ర అధ్యాపకులుగా విధులు నిర్వహిస్తున్న కె.నగేష్‌కు సమ్ స్టడీస్ ఆన్ జనరలైసెడ్ జోర్డాన్ అండ్ లెఫ్ట్ జనరలైసెడ్ డెరివేషన్స్ ఇన్ రింగ్స్ అనే పరిశోధన వ్యాసమును డాక్టర్ సి.జయ సుబ్బారెడ్డి ప్రొఫెసర్ గణిత శాస్త్ర విభాగం ఎస్వీ యూనివర్సిటీ వారి పర్యవేక్షణలో పరిశోధక వ్యాసమును సమర్పించినందుకు గాని డాక్టరేట్‌ను రాయలసీమ యూనివర్సిటీ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ కళాశాల పోరుమామిళ్ల, ప్రిన్సిపల్ డాక్టర్ ఎన్.నరేష్, అధ్యాపక బృందం, సిబ్బంది శుభాకాంక్షలు తెలియజేశారు.

అలుపెరగని పోరాటయోధుడు కృష్ణయ్య

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

అలుపెరగని పోరాట యోధుడు రాజ్యసభ సభ్యులు జాతీయ బిసి సంక్షేమ సంఘ జాతీయ0 అధ్యక్షులు ఆర్.కృష్ణయ్య అని బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతమ బోయిన గురుమూర్తి యాదవ్ అన్నారు. బుధవారం కష్ణయ్య పుట్టిన రోజు సందర్భంగా ఆయన శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం గురుమూర్తి యాదవ్ మాట్లాడుతూ కృష్ణయ్య ఆయురారోగ్యాలు కలిగి బడుగు బలహీన వర్గాలకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. సంక్షేమ పథకాలు బిసిలకు అందుతున్నాయంటే అది కృష్ణయ్య పోరాట ఫలితమే అన్నారు.

ఆర్.కృష్ణయ్యకు శుభాకాంక్షలు చెబుతున్న గురుమూర్తి యాదవ్

అర్హులకు వైఎస్ఆర్ రైతు భరోసా

ప్రజాశక్తి - ముద్దనూరు

అర్హత ఉండి రైతు భరోసా పథకం జాబితాలో పేర్లు లేనివారు ఆయా రైతు భరోసా కేంద్రాల్లో తమ వివరాలు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఎం వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో బుధవారం ఎఒ మాట్లాడుతూ గతంలో కొత్తగా పట్టాదార్ పాస్ పుస్తకాలు వచ్చిన రైతులు ఈ పథకానికి అర్హులన్నారు. పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా నెంబర్, ఫోన్ నెంబరుతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. గతంలో రైతు భరోసా పథకం రాని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

పోలీసుల అనుమతి తప్పనిసరి

ప్రజాశక్తి - వేంపల్లె

వినాయక చవితి సందర్భంగా మండలంలోని అయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసే వినాయక ప్రతిమలకు నిర్వాహకులు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని ఎస్ఐ తిరుపాల్ నాయక్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రతిమల ఏర్పాటుకు అనుమతితో పాటు నిమజ్జన వివరాలు కూడా పేర్కొనాలని తెలిపారు. ఆయా కమిటీలు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. వినాయక విగ్రహ మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు పోలీసుస్టేషన్‌కు వచ్చి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ సూచించారు.

15, 16న మండల స్థాయి క్రీడా ఎంపికలు

ప్రజాశక్తి - ముద్దనూరు

మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 15, 16న మండలస్థాయి క్రీడా ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు బుధవారం పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజబాబు, మండల కో- ఆర్డినేటర్, పిడి మాధవరెడ్డి తెలిపారు. ఈనెల 15న అథ్లెటిక్స్, యోగ, బాల్ బ్యాడ్మింటన్, షటిల్, టెన్నికాయిట్ క్రీడల ఎంపికకు...16న వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, త్రోబాల్ క్రీడల ఎంపికకు పోటీలు ఉంటాయన్నారు. అండర్-14, 17 విభాగంలో బాల బాలికలకు పోటీలు జరుగుతాయన్నారు. క్రీడల్లో పాల్గొనేందుకు విద్యార్థులు తమ స్టడీ సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఐడి నెంబరుతో ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలన్నారు. ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకున్న వారు మాత్రమే క్రీడల్లో పాల్గొనేందుకు అర్హులని తెలిపారు. వివరాలకు 99855 33009ను సంప్రదించాలన్నారు.

చలో ఢిల్లీని జయప్రదం చేయండి

ప్రజాశక్తి - జమ్మలమడుగు రూరల్

ఎస్‌సి రిజర్వేషన్ల వర్గీకరణ కోరుతూ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో మాదిగ ఉద్యోగుల సమాఖ్య (ఎంఈఎఫ్) ఆధ్వర్యంలో తలపెట్టిన చలో ఢిల్లీ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఎంఇఎఫ్ కడప జిల్లా అధ్యక్షులు పిచ్చికె బాబు బుధవారం ప్రకటనలో కోరారు. ఈనెల 18 నుంచి 22 వరకు ఐదు రోజులపాటు జరిగే ప్రత్యేక పార్లమెంటు సమావేశల్లోనే సామాజిక న్యాయమైన ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీ, జంతర్ మంతర్ వద్ద 18, 19న రెండు రోజులపాటు జరిగే మహా ధర్నా నిరసన కార్యక్రమంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.

రోడ్ల విస్తరణకు ప్రజలు సహకరించాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని శ్రీరామ హాల్ రోడ్డు, పాత ఆర్‌టిసి బస్టాండ్ ప్రాంతాల్లో చేపడుతున్న రోడ్ల విస్తరణలో ప్రజలు సహకరించాలని మున్సిపల్ వైసిపి ఇన్‌ఛార్జి వైయస్ మనోహర్‌రెడ్డి, చైర్మన్ వరప్రసాద్, కమిషనర్ నరసింహారెడ్డి కోరారు. ఆ మేరకు వారు బుధవారం పాత అర్‌టిసి బస్టాండ్ వద్ద ఇంటి నిర్మాణ తొలగింపు పనులను పరిశీలించారు. ఇంటి యజమానులు వారి ఇంటి నిర్మాణ తొలగింపు పనులను వేగవంతం చేసి రోడ్డు విస్తరణ పనులకు సహకరించాలని కోరారు. అధికారులు వేసిన మార్క్ నుంచి రోడ్డు నుండి స్థలం వదిలి ఇంటి నిర్మాణ పనులను చేపట్టాలన్నారు. నిబంధనల కొలతలకు విరుద్ధంగా ఉన్న ఇంటి నిర్మాణాలను కచ్చితంగా తొలగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - ముద్దనూరు

మండలంలోని తిమ్మాపురంలో బుధవారం డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ, ఐటిడిఎ నెల్లూరు వారి సౌజన్యంతో జమ్మలమడుగు సిఎస్ఐ క్యాంబెల్ ఆసుపత్రి. ప్రొద్దుటూరు కెవిఆర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్యశిబిరానికి విశేషస్పందన లభించింది. ప్రత్యేక వైద్య నిపుణులు సుధీర్, సునీత, తేజశ్విని, అనిల్ రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

రక్తదానం.. ఆరోగ్యకరం

ప్రజాశక్తి - వేంపల్లె

రక్తదానం చేయడం వల్ల ఎలాంటి సమస్యలు తలెత్తవని తాళ్ళపల్లె ప్రభుత్వ వైద్యురాలు స్వాతి సాయి పేర్కొన్నారు. బుధవారం స్థానిక 7వ సచివాలయంలో తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ఆయుష్మాన్‌భవ కార్యక్రమంలో భాగంగా రక్తదానంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రక్తదానం చేసే సమయంలో అపోహలు వద్దన్నారు. రక్తదానం చేయడం ద్వారా ఆరోగ్యానికి మంచిదన్నారు. కార్యక్రమంలో వార్డు మెంబరు ముత్యాల ఆంజనేయులు, హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ ఉన్నిసా, సూపర్‌వైజర్ వెంకటలక్ష్మి, సిహెచ్ఒ బసవయ్య, పద్మజ, ఎఎన్ఎం భారతి, ఆశా వర్కర్లు, మహిళలు పాల్గొన్నారు.

విద్యార్థులు ఆత్మస్థైర్యం పెంచుకోవాలి

వేంపల్లె : విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ఆత్మస్థైర్యాన్ని పెంచుకోవాలని సైక్రియాటిస్టులు డాక్టర్ కవిత ప్రసన్న, రాధిక ప్రసన్న సూచించారు. ఇడుపులపాయ ఆర్‌కెవ్యాలీ ట్రిపుల్‌ఐటిలో ఎన్ఎస్ఎస్ యూనిట్-15 ఆధ్వర్యంలో బుధవారం యాంటీ సూసైడ్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేగంగా పరుగెడుతున్న సాంకేతిక యుగంలో యువత ఎక్కువగా ఒత్తిడికిలోనై ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు పేర్కొన్నారు. ఊహా ప్రపంచంలో విద్యార్థులు బతికేస్తున్నట్లు చెప్పారు. లక్ష్యానికి అలవాటు పడి అనుకున్నది సాధించలేక పోవడంతో ఆత్మహత్యలు చేసుకుంటున్నట్లు వివరించారు. ఒత్తిడికి విద్యార్థులు దూరంగా ఉండాలని కోరారు. ఎన్ని సమస్యలు ఉన్నా వాటిని అధిగమించేందుకు ప్రయత్నించాలన్నారు. ప్రతి విద్యార్థిలో మానసిక స్థైర్యం ఉండాలని సూచించారు. కార్యక్రమంలో జాతీయ సేవా సమితి విభాగం-15 ప్రో గ్రాం ఆఫీసర్ డాక్టరు మధుసూధన్, కో-ఆర్డినేటర్ కోటీశ్వరి, సుజాత, రిజ్వన్ భాను, కృష్ణప్రియ, ఆయాష్, యాస్మీన్, భాస్కర్, వీరావతి, విద్యార్థులు పాల్గొన్నారు.

చౌక ధాన్యం పట్టివేత

ప్రజాశక్తి - కొండాపురం

కొండాపురంలో అక్రమంగా నిల్వ ఉంచిన ప్రభుత్వ చౌకధాన్యాన్ని విజిలెన్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అందిన సమాచారం మేరకు అధికారులు దాడులు చేశారు. కడప విజిలెన్స్ అధికారులు, జమ్మలమడుగు డివిజన్ రెవెన్యూ అధికారులు తమ సిబ్బందితో స్థావరాన్ని పరిశీలించగా కొండాపురానికి చెందిన ఓ వ్యక్తి 1,510 కిలోల చౌక ధాన్యం అక్రమంగా నిల్వ చేసినట్లు గుర్తించారు. ధాన్యాన్ని స్వాధీనపరచుకొని కొండాపురం పోలీసులకు అప్పగించారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ యోగేంద్ర తెలిపారు.

ఆదాయం సరే.. సౌకర్యాలేవీ..?

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

నెలకు అద్దెల రూపంలో రూ.లక్షలు వస్తున్నప్పటికీ వాటికి అవసరమైన సౌకర్యాలు కల్పించడంలో మాత్రం మున్సిపల్ అధికారులు విఫలమయ్యారనే విమర్శలు వినిపిస్తున్నాయి. స్థానిక గాంధీ రోడ్డులోని ఎస్బీఐ కాంప్లెక్స్‌లో మున్సిపాల్టీకి చెందిన 20 రూములున్నాయి. ఈ గదుల్లో పలు వ్యాపార సంస్థలున్నాయి. కూరగాయల అంగళ్లు, టీకొట్లు, మందుల షాపులు, సెల్‌పాయింట్లు వంటి వ్యాపార సంస్థలున్నాయి. వీటికి కనిష్ఠంగా రూ.9వేల నుండి గరిష్ఠంగా రూ.15వేల వరకు అద్దె రూపంలో మున్సిపాలిటీకి చెల్లిస్తున్నారు. మూడేళ్లకోమారు 33శాతం అద్దె పెంచే నిబంధనలతో గదులు దక్కించుకున్నారు. ఈ గదులకు నీటి సౌకర్యం లేకపోవడంతో వ్యాపారులు పలు ఇక్కట్లను ఎదుర్కొంటున్నారు. ఇక్కడ ఇందిరా గాంధీ విగ్రహం సమీపంలో పబ్లిక్ ట్యాప్ ఉండేది. దీంతో ఈ ప్రాంత వాసులు నీటిని వినియోగించుకనేవారు. పబ్లిక్ ట్యాప్‌ల విధానం లేకపోవడంతో నీటి కష్టాలు మొదలయ్యాయి. నీటిని కొని అవసరాలు తీర్చుకోవాల్సి వస్తోందనివ్యాపారులు వాపోతున్నారు. వ్యాపారాలు అంతంత మాత్రం ఉన్నప్పటికీ నీటికోసం వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారుల స్పందించి ఈ రూములకు నీటి సౌకర్యం కల్పించాలని వారు కోరుతున్నారు. దీనిపై నీటి విభాగ డిఇ దస్తగిరిని వివరణ కోరగా.. వ్యాపారస్తులు తమ వద్ద ఉన్న ఆధారాలతో తమను సంప్రదిస్తే సమస్యను పరిష్కరిస్తామన్నారు.

నీటి సౌకర్యంలేని మున్సిపాలిటీ అద్దె గదులు

పెనుగొండ రవికుమార్‌కు అంతర్జాతీయ డాక్టరేట్

ప్రజాశక్తి - జమ్మలమడుగు

జమ్మలమడుగు పట్టణానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ పెనుగొండ రవి కుమార్‌కు అంతర్జాతీయంగా ప్రతిష్టాత్మకమైన జపాన్‌కు చెందిన ఎఐజెడ్‌యు డాక్టరేట్‌ను బుధవారం ప్రదానం చేసింది. ఆ యూనివర్సిటీకి చెందిన ప్రొఫెసర్లు రాగే ఉదయ్‌కిరణ్, యుటక వటనోబె పర్యవేక్షణలో అసిస్టెంట్ ప్రొఫెసర్ పెనుగొండ రవికుమార్ 'అసోసియేషన్ రూల్ మైనింగ్'లో నిర్వహించిన పరిశోధనను యూనివర్సిటీ డాక్టరేట్ రివ్యూ కమిటీ ప్రొఫెసర్లు ట్రూంగ్, మార్కోవ్ ఆమోదించారు. 2013లో భారతదేశంలోనే అత్యున్నత విశ్వవిద్యాలయం అయిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ బెంగళూరు నుండి కంప్యూటర్ సైన్స్ విభాగంలో తన మాస్టర్స్ పూర్తి చేసిన రవికుమార్ ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా తన ప్రస్థానాన్ని మొదలెట్టారు. దాదాపు పదేళ్లుగా యూనివర్సిటీలోని కీలకమైన ఎమ్-టెక్ కో-ఆర్డినేటర్‌గా, క్రమశిక్షణ కమిటీ సభ్యులుగా, ఐటి ఇన్ఫ్రాస్ట్రక్చర్ కో-ఆర్డినేటర్‌గా అదనపు విధులు నిర్వహిస్తూ సేవలు అందిస్తున్నారు. 2020లో జపాన్ ఎఐజెడ్ యూనివర్సిటీలోని ప్రొఫెసర్ల సెలక్షన్ కమిటీ నిర్వహించిన ఎంట్రెన్స్ ఎగ్జామ్స్, మౌఖిక పరీక్షలో ఉత్తీర్ణులై పిహెచ్‌డికి ఎంపికయ్యారు. ఆ యూనివర్సిటీలో పరిశోధన అసోసియేషన్ రూల్ మైనింగ్‌లో అవసరమైన కొత్త అల్గారిథం, నోవల్‌ను అభివృద్ధి చేశారు. రవి పరిశోధన డేటాసెట్లలోని సంబంధాలను అర్థం చేసుకోవడంలో సెంట్రల్ పార్ట్‌గా ఉంది. విశిష్ట నైపుణ్యంతో అతను రాసిన ఆర్టికల్స్‌ను అంతర్జాతీయంగా ప్రఖ్యాతిగాంచిన కాన్ఫిరెన్స్ మరియు జర్నల్స్‌లో ప్రచురితమైంది. తన పరిశోధన కాలంలో రెండు పేటెంట్‌ని కూడా రిజిస్టర్ చేశారు. ఈ సందర్భంగా ట్రిపుల్‌ఐటి ఎఒ రాంభూపాల్ రెడ్డి ముందుగా పెనుగొండ రవికుమార్‌కు అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ యూనివర్సిటీలోని ప్రొఫెసర్లతో కలిసి పనిచేసే స్థాయికి తమ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎదిగినందుకు హర్షం వ్యక్తం చేశారు. అసిస్టెంట్ ప్రొఫెసర్ పెనుగొండ రవికుమార్ మాట్లాడుతూ స్టడీలీవ్ ఇచ్చి తన పరిశోధన విజయవంతం అవడానికి సహకరించిన ట్రిపుల్‌ఐటి ఛాన్సలర్ కెసి రెడ్డికి, వైస్ ఛాన్సలర్ విజయ్‌కుమార్‌కు, డైరెక్టర్ సంధ్యారాణికి ధన్యవాదాలు తెలిపారు.

పోలింగ్ బూత్‌లపై అభ్యంతరాలుంటే చెప్పాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

పులివెందుల రెవిన్యూ డివిజన్ పరిధిలోని పులివెందుల, వేముల, వేంపల్లి, చక్రాయపేట, వీరపు నాయనపల్లి, తొండూరు, సింహాద్రిపురం, లింగాల మండలాల్లో పోలింగ్ బూత్‌లపై అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తేవాలని ఆర్‌డిఒ వెంకటేశ్వర్లు రాజకీయ పార్టీల నాయకులకు సూచించారు. స్థానిక ఆర్‌డిఒ కార్యాలయంలో బుధవారం ఆయన ఓటరు నమోదు పక్రియ, మార్పులు చేర్పులు. పోలింగ్ బూత్‌ల అభ్యంతరాలపై రాజకీయాల పార్టీ నాయకులు, రెవెన్యూ డివిజన్ పరిధిలోని తహశీల్దార్లు, ఆర్ఐలతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆర్‌డిఒ మాట్లాడుతూ 2024లో అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో 18ఏళ్ల పైబడిన వారందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేయాలని బిఎల్ఒలకు సూచించారు. వినాయక చవితి పండుగను ప్రజలు సామరస్య పూర్వకంగా జరుపుకోవాలని ఆర్‌డిఒ కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు చంద్రమౌళి, టిడిపి నాయకులు వెంకటరామిరెడ్డి, జనసేన నాయకులు శ్రీపతి శ్రీనివాస్, ఇతర రాజకీయ పార్టీల నాయకులు, తహశీల్దార్లు, అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

విద్యుత్ వృథాను అరికడితే ఆదా చేసినట్లే

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

అభివృద్ధిలో ముందున్న వారితో పోటీపడాలని విద్యుత్ ఎస్ఇ రమణ అన్నారు. స్థానిక విద్యుత్ కార్యాలయంలో ప్రొద్దుటూరు డివిజన్ క్షేత్రస్థాయి అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వృథాను అరికడితే ఆదా చేసినట్లే అన్నారు. పని చేయాలనే సంకల్పంతో ముందుకు వెళితే ఫలితాలు అద్భుతంగా ఉంటాయన్నారు. ఉద్యోగులు నిర్దేశించిన ప్రాంతాల్లో నివాసముంటే ఆశించినమేర ఫలితాలు వస్తాయన్నారు. విచారణ చేయించి కేటాయించిన ప్రాంతాల్లో నివాసం లేనివారిపై తగు చర్యలు తప్పవని హెచ్చరించారు. విద్యత్ అంతరాయాలు అధికంగా ఉన్నాయని, లైన్‌లలో తిరిగి సమస్యలు గుర్తించాలన్నారు. నిరంతరం నాణ్యమైన విద్యుత్ అందించాలన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్ సరఫరాలో ఎలాంటి జాప్యం ఉండకూడదన్నారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టాలన్నారు. వాలిపోయిన స్తంభాలను, లూజు లైన్లను ఎప్పటికప్పుడు సరిచేయాలన్నారు. ట్రాన్స్‌పార్మర్ల వైఫల్యాలను తగ్గించేందుకు అవసరమైన మరమ్మతులు ముందుగా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో డివిజన్ పరిధిలోని ప్రొద్దుటూరు, రాజుపాలెం, జమ్మలమడుగు, మైలవరం, ముద్దనూరు. పెద్దముడియం, కొండాపురం, యర్రగుంట్ల, వియన్ పల్లి, కమలాపురం మండలాల క్షేత్రస్థాయి అధికారులతోపాటు ప్రొద్దుటూరు డివిజన్ ఇఇ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

సమీక్షలో మాట్లాడుతున్న ట్రాన్స్‌కో ఎస్ఇ రమణ

విసికి వినతి పత్రమిస్తున్న తులసిరెడ్డి

రెగ్యులర్ ఉర్దూ డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

యోగి వేమన విశ్వవిద్యాలయంలో రెగ్యులర్ ఉర్దూ డిపార్ట్‌మెంట్‌ను ఏర్పాటు చేసేందుకు అధికారులు తగు చర్యలు తీసుకోవాలని పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి కోరారు. ఆ మేరకు తులసిరెడ్డి, మైనార్టీ నేత నజీర్ అహ్మద్ బుధవారం విశ్వవిద్యాలయంలో వైస్ ఛాన్సలర్ చింతా సుధాకర్‌కు వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ వేమన విశ్వవిద్యాలయంలో 2017లోనే ఉర్దూ డిపార్టుమెంటు ఏర్పాటైనప్పటికీ సెల్ఫ్ సపోర్టింగ్ విభాగంగానే ఉందన్నారు. ఉర్దూ పిజి విద్యార్థులకు పిహెచ్‌డి అవకాశం లేదన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఉర్దూ డిపార్ట్‌మెంట్‌ను రెగ్యులరైజ్ చేసి ఒక ప్రొఫెసర్, ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, నలుగురు అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఒక జూనియర్ అసిస్టెంట్ పోస్టు, ఒక అంటెడర్ పోస్టు మంజూరయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. స్పందించిన వైస్ ఛాన్సలర్ తన వంతు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఉత్తన్న, అమర్, సుబ్బరాయుడు, శివ, రామకృష్ణ పాల్గొన్నారు.

బోగస్ ఓట్లను తొలగించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న బోగస్ ఓట్లను తొలగించాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, పులివెందుల నియోజకవర్గం ఇన్‌ఛార్జి వేలూరు శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 27 లక్షల పైచిలుకు బోగస్ ఓట్లు ఉన్నాయని ఎలక్షన్ కమిషన్ చెప్పడం శోచనీయమన్నారు. వాటిని తొలగించేందుకు ఎలక్షన్ కమిషన్ వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. బాధ్యులైన అధికారులను గుర్తించి వారిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సింహాద్రిపురం బిసి సెల్ అధ్యక్షులు రమేష్, వేముల మండలశాఖ అధ్యక్షులు మహేంద్ర, పులివెందుల మండలశాక అధ్యక్షులు తిరుపాల్‌రెడ్డి, జిల్లా ముస్లిం మైనారిటీ ఉపాధ్యక్షులు తుపాకుల నూర్‌బాషా పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలులో ఆదర్శం

చాపాడు : సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యే ఎస్.రఘురామిరెడ్డి సూచించారు. మండల పరిధిలోని ఎన్.ఓబాయపల్లె సచివాలయ పరిధిలోని అనంతపురం గ్రామంలో బుధవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ప్రతి ఇంటికెళ్లి అందుతున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. వైసిపి నియోజకవర్గ సమ న్వయకర్త ఎస్.నాగిరెడ్డి, ఎంపిపి టి.లక్షుమయ్య, ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు, తహశీల్దార్ సుభాని, సర్పంచ్ లలితమ్మ, మండల కన్వీనర్ రాజశేఖర్‌రెడ్డి, గృహ సారధుల మండల కన్వీనర్ రామ్మోహన్‌రెడ్డి, జయరామిరెడ్డి, సివి సుబ్బారెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, వెంకట సుబ్బారెడ్డి, జయ సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, పివి రమణారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, ఓబుళరెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, వెంకట సుబ్బయ్య, గంగులయ్య, రాజు, రవి, అధికారులు, పంచాయతీ కార్యదర్శి శ్రీనువాసులరెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

చిన్న పిల్లలకు టీకాలు వేయించాలి

ప్రొద్దుటూరు : చిన్నపిల్లలకు టీకాలు వేయించి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని డబ్ల్యుహెచ్ఒ ప్రతినిధి డాక్టర్ అలీ తెలిపారు. రొటీన్ ఇమ్యునైజేషన్ సెషన్, మిషన్ ఇంద్రధనుష్ కార్యక్రమంలో భాగంగా బుధవారం స్థానిక బొల్లవరంలోని క్రిష్టియన్ కాలనీ, బాపూజీ నగర్‌లలో ఇంటింటికి తిరిగి పిల్లల టీకాల విషయమై ఆరా తీశారు. టీకాలు వేశారా లేదా అని అడిగి తెలుసుకున్నారు. సిఒ సుబ్బారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

వేలం ప్రకటన

కడప జిల్లా, వేముల (మం), నల్లచెరువు పల్లె గ్రామంలో వెలసిన మోపూరు భైరవేశ్వర స్వామి దేవస్థానమునకు సంబంధించి తలనీ లాలు వసూలు చేసుకొను హక్కు, టెంకాయ లు అమ్ముకొను హక్కులకు గాను | 21-9-2023 తేదీ ఉదయం 10.00 గం॥లకు దేవస్థానం వద్ద బహిరంగ వేలంపాట నిర్వహించ బడును. తలనీలాలు పాటకు 50,000, | టెంకాయలు వేలంపాటకు 5,000/- ధరావత్తు చెల్లించవలయును. తక్కిన వేలంపాట షరతులు వేలం రోజు తెలుపబడును.

ఇట్లు : చైర్మెన్ మరియు కార్యనిర్వహణాధికారి

శ్రీశ్రీశ్రీ అరుణాచలస్వామి దేవాలయం

గుర్రాలచింతపల్లి (గ్రా), పెండ్లిమర్రి (మం), కడప జిల్లా.

e-Procurement Tender

NIT NO. TTD-78022(31)/160/2023-HDPP Dt: 07.08.2023

మిగిలిన దేవాలయ నిర్మాణము మరియు ప్రహారీగోడ నిర్మణము కొరకు e-Procurement ద్వారా టెండర్లు కోరడమై నది. వివరములకు https://tender.apeprocurement.gov.in వెబ్‌సైట్‌ను చూడగలరు.

ఇట్లు : ధర్మకర్త

ప్రవీణ్ తిరుమల పాదయాత్ర ప్రారంభం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు త్వరగా బెయిల్‌పై విడుదల కావాలని ప్రొద్దుటూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జివి ప్రవీణ్‌కుమార్‌రెడ్డి బుధవారం ఉదయం తిరుమలకు పాదయాత్ర ప్రారంభించారు. వంద మంది నాయకులు, కార్యకర్తలతో ప్రొద్దుటూరులోని తన నివాసం నుండి బయల్దేరారు. మాజీ ఎమ్మెల్యే వీర శివారెడ్డి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో పొద్దుటూరు ఎన్నికల పరిశీలికులు బోడె ప్రసాద్, ముక్తియర్, ఇవి సుధాకర్‌రెడ్డి, తాటి శ్రీనివాస్ యాదవ్, నాగమునిరెడ్డి పాల్గొన్నారు. **చాపాడు :** ప్రవీణ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపట్టిన తిరుమల పాదయాత్ర చాపాడు చేరుకోవడంతో టిడిపి మండలశాఖ అధ్యక్షుడు అన్నవరం సుధాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మునిశేఖర్‌రెడ్డి , మండల నాయకులు టిఒ పల్లె రవిశంకర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు సుదర్శన్, నారాయణరెడ్డి, నారపరెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, మధు, రాము, రామాంజనేయులు, రామ్మోహన్, మహమ్మద్, సుధాకర్, రాజు, మల్లికార్జున, చాపాడు బయపురెడ్డి, కృష్ణారెడ్డి, నాగరాజు, లోకేష్ పాల్గొన్నారు.

పాదయాత్రలో ప్రవీణ్, టిడిపి నాయకులు

ఆరోగ్య కేంద్రాలకు ఆర్‌డిటి కిట్లు సరఫరా

ప్రజాశక్తి - వేంపల్లె

పులివెందుల సబ్ యూనిట్ పరిధిలోని ఆరోగ్య కేంద్రాలకు ఆర్‌డిటి కిట్లు సరఫరా చేసినట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి సిద్దయ్య తెలిపారు. మండలంలోని తాళ్ళపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం రక్త పరీక్షలు చేసే ఆర్‌డిటి కిట్లను ఆయన సిబ్బందికి అందజేశారు. ఈ సందర్భంగా సిద్దయ్య మాట్లాడుతూ తాళ్ళపల్లె, వేముల, నల్లపురెడ్డిపల్లె, లింగాల, బిదినంచెర్ల, సింహాద్రిపురం, కోవరంగుట్టపల్లె, తొండూరు. సంత కొవ్వూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు, నగరిగుట్ట, బాకరాపురం పులివెందుల అర్బన్ హెల్త్ సెంటర్ పరిధిలో దోమల నివారణకు సైపనోత్రిన్ మందును కూడా అందజేసినట్లు చెప్పారు. అయా గ్రామాల్లో మలేరియా లక్షణాలు ఉన్నట్లయితే వెంటనే ఆశా కార్యకర్త ఆర్‌డిటి కిట్ల ద్వారా పరీక్షలు చేస్తారని తెలిపారు. డెంగీకి సంబంధించి కిట్లు ప్రతి ఎంఎల్‌హెచ్‌పి వద్ద అందుబాటులో ఉన్నాయన్నారు. డెంగీ నిర్ధారణ పరీక్షలు పులివెందుల ఏరియా ఆస్పత్రిలో నిర్వహిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్త భాస్కర్ పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు

ప్రజాశక్తి - ఖాజీపేట

అర్హతగల ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని ఎపిఐఐసి డైరెక్టర్ దుగ్గిరెడ్డి గంగాధర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయంలోని సచివాలయ కార్యాలయంలో బుధవారం నూతనంగా మంజూరు చేసిన పెన్షన్లను ఆయన లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా గంగాధర్‌రెడ్డి మాట్లాడుతూ పార్టీలకు, కులమతాలకు అతీతంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో కూడా ప్రజలందరూ వైసిపికే పట్టం కట్టాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచు రాణెమ్మ, ఉప మండలాధ్యక్షుడు. చంద్రభాస్కర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్సులు శ్రీనివాసులు, తులసీకుమార్‌రెడ్డి, వెల్ఫేర్ హేమలత, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ ఎలిశెట్టి రఘు, సచివాలయ కన్వీనర్ కొంగాణి వెంకటరమణ, డీలర్ చంద్రశేఖర్‌రెడ్డి, వాలంటీర్లు పాల్గొన్నారు.

తిమ్మాపురంలో పింఛన్లు మంజూరు

ముద్దనూరు : మండలంలోని కె.తిమ్మాపురం గ్రామంలో కొత్తగా అయిదు మందికి మంజూరైన వైఎస్ఆర్ పింఛన్ మంజూరైంది. వీరికి బుధవారం వైసిపి మండల కన్వీనర్ శ్రీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో పింఛన్ పంపిణీ చేశారు.

ఉద్యాన శాఖ విస్తరణాధికారి నియామకం

ప్రజాశక్తి - సింహాద్రిపురం

ముద్దనూరు ఉద్యా శాఖ పరిధిలోని సింహాద్రిపురం, తొండూరు మండలాలకు ఆ విస్తరణాధికారి వీరారెడ్డిని నియమించినట్లు హెచ్ఒ మల్లేశ్వర్ రెడ్డి తెలిపారు. ఆయా రెండు మండలాలు కలిపి ఆయనకు బాధ్యతలు అప్పజెప్పామన్నారు. అనంతరం వీరారెడ్డి మాట్లాడుతూ ఉద్యాన శాఖ రైతులకు నిరంతరం అందుబాటులో ఉండి, వారి అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. ఆయనకు ఇటీవలే గురజాల రైతు భరోసా కేంద్రం నుంచి ఉద్యోగోన్నతి లభించింది.

ఎన్‌టిఆర్ విగ్రహానికి వైసిపి నేతల పాలాభిషేకం

సింహాద్రిపురం : తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారక రామారావు విగ్రహానికి బుధవారం వైసిపి నాయకులు పాలాభిషేకం చేశారు. మండలంలోని బిదినంచర్లలో ఉన్న ఎన్‌టిఆర్ విగ్రహానికి వైసిపి మండల కన్వీనర్, మండల ఉపాధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు బ్రహ్మానందరెడ్డి, అరవిందనాథ్‌రెడ్డి పాలాభిషేకం చేశారు. వైసిపి నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా దుస్తులు వితరణ

బ్రహ్మంగారిమఠం : మండలంలోని మల్లేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 20 మంది విద్యార్థులకు కపిల్ చిట్స్ రాయలసీమ జోన్ మేనేజింగ్ డైరెక్టర్ బాలబయపురెడ్డి బుధవారం క్రీడా దుస్తులు వితరణ చేశారని పాఠశాల ప్రదానోపాధ్యాయురాలు లక్ష్మీదేవి తెలిపారు. ఈ ఏడాది పదవ తరగతిలో ఫస్ట్, సెకండ్ సాధించిన విద్యార్థులకు బహుమతులు ఇవ్వనున్నట్లు దాత తెలిపారన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ వెంకటేశ్వర్లు, శివమోహన్‌రెడ్డి, సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయులు ఆర్.పాపయ్య, గురయ్య, సుధాకర్, పిటి విజయవాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

హాసీనా బేగం భర్త మహమ్మద్ చాంద్ వలీ, వయస్సు 49 సం॥లు, నివాసం: డి.నెం.20-221, ఎం.పి.డి.ఓ ఆఫీస్ రోడ్డు, జమ్మలమడుగు టౌన్, వై.యస్.ఆర్.కడప జిల్లా, ఇండియా వారు రుణ నిమిత్తమై స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎస్.ఎం.ఇ. శాఖ, ప్రొద్దుటూరు వారిని సంప్రదించినారు. దిగువ కనబరచిన స్థిరాస్తిపై సదరు స్థిరాస్తికి దఖలు పడి **రిజిష్టర్డ్ విక్రయ పత్రంనెం. 588/2013(ఎ) వారు ఇంటి వద్ద నుండి పాత బస్టాండ్‌కు వెళ్ళు మార్గమధ్యంలో దారపోయినది. సదరు విషయై సంబంధిత పోలీస్ స్టేషన్ నందు తేది: 17.08.2023న కంప్లయింట్ చేసియున్నారు. ఇందుకు సంబంధించి పోలీస్ వారు తేది: 21.08.2023న నాన్ ట్రేసబుల్ సర్టిఫికెట్ కూడా జారి చేసియున్నారు.** కావున కావున సదరు స్తిరాస్తిపై ఎవరికేనీ ఆక్షేపణ అభ్యంతరాలున్న యెడల అట్టివారు ప్రకటన తేది నుండి 10 రోజులలోగా తమ ఆక్షేపణ అభ్యంతరాలను తగు సాక్షాధారములతో నాకు గానీ, దిగువ కనబరచిన సంతకందారుకు కానీ తెలుపగలరు. గడువులోగా ఎలాంటి ఆక్షేపణలు రాని యెడల ఎవరికీ ఎలాంటి ఆక్షేపణలు లేవని భావించి తదుపరి రుణ మంజూరీ విషయం పరిశీలించ బడును.

షెడ్యూలు: వై.యస్.ఆర్. జిల్లా, జమ్మలమడుగు సబ్ డివిజన్‌లో చేరిన జమ్మలమడుగు మండలంలోని జమ్మలమడుగు (నగర పంచాయతీ) టవున్‌లో ఆస్తి వివరం: 20వ బ్లాక్, యం.డి.ఓ ఆఫీస్ రోడ్డు, లోపలి భాగం ఏరియా, డోర్ నెం.20/221 మహాడి డోర్ నెం.20/221(1) గల ఇల్లు, మహాడి సర్వేనెం.465/బికు చెందినది. తూర్పు: పెద్దముడియం అబ్దుల్ రసూల్ ఇల్లు, పొర గోడ, పడమర: బి-షెడ్యూలు దాఖలా పెద్దముడియం మహాబూబ్ హుస్సేన్ వాటాకు రాబడిన ఇల్లు మరియు మహాడి పొరగోడ, ఉత్తరం: పబ్లిక్ రోడ్డు, దక్షిణం: అంచల గైబూసాహెబ్ ఇల్లు, ఈ దిశలకు లోనైనా: తూర్పు-పడమర: 29అ. 2 అంగులాలు, లేక 8.88 మీటర్లు, ఉత్తరం- దక్షిణం: తూర్పు దిశన 35అ. 6 అంగులాలు లేక 10.80 మీ. పడమర దిశన 34అ.6 అంగుళాలు లేక 10.50 మీ. కొలతలు కలిగిన 113.423 చ.గ. గల బయలున్నూ, ఈ బయలులో గల పై నంబరు గల ఆర్.సి.సి. కప్పు ఇంటికి కొలతలు: తూర్పు - పడమర: 29 అడుగుల 2 అంగుళాలు లేక 8.88 మీ. ఉత్తరం - దక్షిణం: తూర్పు దిశన 34అ. లేక 10.35 మీ. పడమర దిశన 33అ. లేక 10.05 మీటర్లు కొలతలు కలిగిన 977.061 చ.అ. కలిగినిది. ఈ ఇంటికి పైన వున్న ఆర్.సిసి. మహాడి కొలతలు: తూర్పు - పడమర: 24అ. 9 అంగుళాలు, లేక 7.53మీ. ఉత్తరం - దక్షిణం 21అ. 3 అంగులాలు లేక 6.47మీ. కొలతలు కలిగిన 525.93 చ.అ. కలిగినది. ఈ మహాడికి ఆగ్నేయ దిశన గల ఆర్.సి.సి. కప్పు గల కు.ని.గా వున్న మహాడికి కొలతలు: తూర్పు-పడమర: 4అ. 5 అంగుళాలు, లేక 1.34 మీ.ఉత్తరం - దక్షిణం: 9అ. 3 అంగుళాలు లేక .281 మీ. కొలతలు కలిగిన 40.848 చ.అ. కలిగినది.

పై ఇంటికి ఉత్తరం దిశన తలవాకిలి కలిగి తూర్పు - పడమర దిశలో పై ఇంటికి మహాడికి పొరగోడల హక్కులు కలిగి వున్నది. పై ఇంటికి, మహాడికి ఉత్తర-దక్షిణం దిశలలో పూర్తి గోడల హక్కులు కలవు. పై ఇంటికి, మహాడికి అడుగు స్థలం పైకప్పు, తలుపులు, ద్వార బంధనాలు, నీటి కొళాయి, కరెంటు మీటరుతోను, పై ఆస్తికి సంబంధించిన యావత్తు ఈజ్‌మెంట్ హక్కులతో సహా. పై ఇంటికి పై బయలు కొలతలకు లోబడి దక్షిణ దిశన గోడ క్రింద ఒకటిన్నర అడుగు వెడల్పుతో తూర్పు- పడమర గోడ వెంబడి బయలు కలదు.

చిరునామా:- **హసీనా బేగం** భర్త మహమ్మద్ చాంద్ వలీ,
డి.నెం.20-221, ఎం.పి.డి.ఓ ఆఫీస్ రోడ్డు, జమ్మలమడుగు టౌన్,
వై.యస్.ఆర్.కడప జిల్లా,